

# అనగనగా... మనకథ

శ్రీ

## అద్దం

**ఆ రోజు నేనో వింత దృశ్యం చూశాను. బైక్ నడుపుతున్న ఫ్రెండ్‌తో...**

**"ఏవండేవండీ...ఒక్కసారి బైక్ వెనక్కి తిప్పండి" చాలా ఎగ్జైటింగ్‌గా అడిగాను.**

"దేనికీ..." ఎవరో అందమైన సుందరాంగో...లంగా వోణీ వయ్యారో... అయితే ఇంకోసారి చూడాలనిపించి పనున్నట్లు వెనక్కి మళ్లీ... ఓసారి మళ్లీ చూడ్డం ఆ రోజుల్లో మా సరదా. అందుకే ఆయన కూడా ఉత్సాహంగా బండి వెనక్కి తిప్పాడు.

"ఇక్కడే...ఇక్కడాపండి" అంటూ నేను చూసిన దృశ్యానికి కాస్త చాటుగా బైక్ ఆపించాను.

60, 70 ఏళ్ల మధ్యలో ఉన్న ముసలావిడ- భర్త గతించిన వైనం ఆవిడ కట్టుకున్న మల్లు పంచె (చీర అనరు దాన్ని) చాటున ఉన్న గుండు వల్ల తెలుస్తోంది.

వళ్లంతా ముడతలు!

పళ్లు లేవు!

ఆ వయస్సులో ఆ ఆకారంలో వీధి అరుగుమీదే కూచుని అద్దం చూసుకుంటోంది.

ఎందుకుట?

నవ్వు రాబోయి, డౌట్ పెరిగింది. నిజంగా ఆవిడకి అద్దంలో చూసుకుంటే అందం కనిపించదు. ఆనందం కలగదు. మరెందుకు ఈ అద్దం పిచ్చి?

"ఆవిడెవరండీ" మా ఫ్రెండ్ నడిగాను. ఫ్రెండ్ చెప్పిన విషయం కథలా అనిపించింది!!

* * *

ఆవిడ పేరు అన్నపూర్ణమ్మగారు.

గత నాలుగు నెలల దాకా తన గంభీర వాఘరితో అనర్గళంగా చుట్టుపక్కల ఆలయాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఉపన్యాసాలు చెప్పే వేలాది భక్తుల హృదయాల్ని ఆకట్టుకున్న రామశాస్త్రిగారి అర్ధాంగి ఆమె!

రామశాస్త్రిగారిది గంభీరమైన గళం మాత్రమే కాదు- నిలువెత్తు పాండిత్యం- చెయ్యెత్తు సౌందర్యం. ఆయన పలకరింపు స్వాంతనం. దరహాసం- అనురాగ యుతం. పద్యాలాపన...సంగీతమయం అర్థవివరణ.. ఆలోచనామృతం - పండిత పామర రంజకంగా...నాటకం చూపిస్తున్నట్లు, ఆయన నమ్మేదే చెప్పేవాడు... చెప్పినదే...ఆచరించేవాడు.

ఎప్పుడో 8 ఏళ్ల పిల్లగా ఉండగా అన్నపూర్ణ - రామశాస్త్రి భార్య అయింది. రామశాస్త్రి పెళ్లినాటికి 13 ఏళ్లు. అప్పటికే అతను పంచకావ్యాలూ కొన్ని పురాణాలూ లక్ష్య లక్షణంగా చదివేశాడు. పిల్ల బంగారంలా ఉందని రామశాస్త్రి తల్లిదండ్రులు ముచ్చటపడ్డారు. రామశాస్త్రికి మహర్దశ ఉందని అతని జాతకం చూసి అన్నపూర్ణ తల్లిదండ్రులు సంబరపడ్డారు. రెండు కుటుంబాల వాళ్లు కలిగిన వారే కావటంతో వైభవోపేతంగా వారి వివాహం జరిగింది. రెండు కుటుంబాల పెద్దలూ గతించారు గానీ...వీళ్లింట వంశాంకురం జరగలేదు. పెద్దవాళ్లందరూ దూరమైపోయాక అన్నపూర్ణకి పిల్లల్లేరనే బెంగ మొదలైంది.


ముప్పయ్యేళ్లు దాటుతున్నా, పిల్లలు కలగలేదని బెంబేలెత్తిపోయేది. రామశాస్త్రి స్థితప్రజ్ఞుడు- "ఊరు అందరూ నన్ను గురువుగా నిన్ను అమ్మగా ఆదరిస్తుంటే ఇంకా మనం ఒంటరివాళ్లన్న బాధ దేనికి" అని అన్నపూర్ణకి నచ్చచెప్పేవాడు. భర్త తన ఉపన్యాస కార్యక్రమంలో హడావుడిగా ఉన్న వేళ ఆ ఒంటరితనంతో మరింత బెంగటిల్లేది. ఈయన తన భార్యని కన్నకూతుర్లా లాలించేవాడు. కన్నతల్లిలా ఆరాధించేవాడు. భర్తగా తన బాధ్యతలన్నీ సక్రమంగా నిర్వర్తించేవాడు. స్నేహం అనే మాటలో ఇద్దరూ తలో అక్షరం- ప్రేమ అనే పదంలో ఇద్దరూ చెరో అక్షరం. భార్యను మరిపించడానికీ...మురిపించడానికీ రామశాస్త్రిగారికి ఓ రోజు ఒక సరదా ఆలోచన పుట్టింది. బయట నుండి తిరిగి వచ్చేటప్పుడు డజను నిలువుటద్దాలు కొని తెచ్చాడు. ఏమిటో... ఎందుకో తెలియక అయోమయంలో పడిన అన్నపూర్ణమ్మ ప్రశ్నకి జవాబుగా చిలిపిగా నవ్వుతూ 'చూస్తావుగా' ఆత్రం దేనికి అన్నట్టు చూశాడు! ఆమె ఆశ్చర్యంలో ఉండగానే ఇంటినిండా నిలువుటద్దాలు ఏర్పాటు చేయించాడు. ముందు గదిలో, పడక గదిలో, వంటింట్లో ఆఖరికి నీళ్ల గదిలో కూడా గోడలకి రెండువైపులా నిలువుటద్దాలు ఏర్పాటు చేయించాడు. విస్తుపోతున్న భార్యతో "నీకెంతమంది ముత్తైదువులు తోడున్నారో చూడు. సప్త ఋషుల భార్యలు, త్రిమాతలు.. ఆరుగురు పతివ్రతలు.." అంటూ తనకున్న పురాణ పరిజ్ఞానాన్ని ఉదహరిస్తూ ఆమెను నవ్వించాడు. మైమరిపించాడు. తొలి యవ్వన సౌరభాలని, సౌందర్యాన్ని చవిచూపించి...తుళ్లింతలతో పులకింప చేశాడు. అన్నపూర్ణమ్మ ఎంతో స్వాంతన పొందింది. చిన్నపిల్లలా మురిసిపోయింది.

* * *

ఓ రోజు రామశాస్త్రిగారు ఒక ఆలయ ప్రాంగణంలో గజేంద్రమోక్షం ప్రవచనం చెప్తున్నారు. "అల వైకుంఠ పురంబులో...నగరిలో..." అంటూ కళ్లకి కట్టినట్టు చెప్తూ...ఆ 'రమా వినోదుడిని' బొమ్మేసినట్టు చూపిస్తూ...చూస్తూ...తన్మయంగా వ్యాస పీఠం మీదకి నెన్నుదురు సోకించాడు. ఇంక లేవలేదు.

"ఊళ్లో వాళ్లందరూ మన కొడుకులేనే" అంటూ నిత్యం అనే రామశాస్త్రి మాట... సత్యం అయినట్లు ఊళ్లో వాళ్లందరూ కలసి ఆయన అంత్యక్రియలు ఘనంగా

**ఆమె రూపం మారిపోయింది. పసుపు, కుంకాలు, రంగురంగుల పట్టుచీరలు, వంటి మీదుండే బంగారు ఆభరణాలు, ఇంట్లో ఉండే పందిరి పట్టె మంచం దగ్గర్నుంచి ఆయన తనూ ఇన్నాళ్లుగా పోగేసుకున్న ఐశ్వర్యాన్నంతటినీ ఊళ్లోని కొడుకులందరికి తన భర్త జ్ఞాపకంగా పంచిపెట్టేసింది.**



నిర్వర్తించారు.

అన్నపూర్ణమ్మ సశాస్త్రీయంగా వైధవ్యాన్ని స్వీకరించింది.

పది రోజులు పండగలా చేశారు. రామశాస్త్రిని అందరూ కలిసి స్వర్గానికి సాగనం పారు.

ఆ తర్వాత ఆమె రూపం మారిపోయింది. పసుపు, కుంకాలు, రంగురంగుల పట్టుచీరలు, వంటి మీదుండే బంగారు ఆభరణాలు, ఇంట్లో ఉండే పందిరి పట్టె మంచం దగ్గర్నుంచి ఆయన తనూ ఇన్నాళ్ళుగా పోగేసుకున్న ఐశ్వర్యాన్నంతటినీ ఊళ్లోని కొడుకులందరికి తన భర్త జ్ఞాపకంగా పంచిపెట్టేసింది.

ఇంక మిగిలినవి...డజను నిలువుటద్దాలు. అవన్నీ కూడా అవసరమైన వాళ్లందరినీ 'పట్టుకెళ్లిపోమ'ని తను నీళ్లతో కళ్లు మూసుకుంది. ఇప్పుడా ఇంట్లో తను ఏకాకి. దేవుడి పిలుపు కోసం, తన దేవుణ్ని చేరడం కోసం..తను వండుకుని...కొంత తిని.. మిగిలిందంతా పనమ్మాయికో, పాలవాడికో పంచిపెట్టేస్తుంది. యముడి కోసం తపస్సు చేస్తున్న యోగినిలా మారిపోయింది.

* * *

నాలుగు నెలలు ఇలా భారంగా గడిచి పోయాయి. గాయం చేసే దేవుడు మాయం చేసే మంత్రం వేస్తాడంటారు. కానీ అన్నపూర్ణమ్మకి ఆ మంత్రం పనిచేయ లేదు. కళ్లల్లో నీళ్లు ఇంకిపోయినా ఆవిడ శోకం ఆగలేదు.

ఇప్పుడిన్నాళ్లు పోయాక ఆవిడకు అద్దం కావల్సి వచ్చింది. ఎందుకు? తెలుసుకోవాల్సిందే!

* * *

హఠాత్తుగా అన్నపూర్ణమ్మ కంట్లో నలక పడింది. చూడ్డానికీ, తీయడానికీ ఎవరూ లేరు. ఎవరైనా ఉన్నా పిలిచి సాయం చేయమనే తత్వం కాదావిడది. పనిపిల్ల అంట్లు తోమడానికి వచ్చిన మర్నాడు కప్పలా వాచిన కన్ను చూసి కంగారు పడింది. ఆయుర్వేద వైద్యం చేసే గుడిలో పూజారిగారిని పిలిచింది. ఆయన కన్ను చూసి కంగారు పడ్డాడు. ఆయనొచ్చేసరికి అద్దంలో చూసుకుంటూ కంటికీ, మంటికీ నీరు కారుస్తున్న అన్నపూర్ణమ్మగారి కంటికి ఇది మరీ ప్రమాదమని హెచ్చరించాడు. పనిమనిషితో అద్దం తీసేయమని చెప్పి, "అమ్మా! మీరు కంటిని బాగా నలిపారు. పైగా చాలా దుఃఖపడుతున్నారు. ఈ దుఃఖానికి కారణం నాకు తెలుసు. మీరు ఇన్నాళ్లుగా అద్దం చూసుకో లేదు...ఇప్పుడు..."

"నాకద్దం అవసరమయ్యింది. ఆయన రోజూ దేవతార్చన చేసేముందు...విభూతి పెట్టుకునే దేవతార్చన పెట్టెలోని అద్దం తీయక తప్పలేదు. ఆ దేవుడూ, అర్చనా నేను వదిలేసినా దేవతార్చన పెట్టె తీయక తప్పలేదు. అద్దాన్ని చూడక తప్పట్లేదు. అద్దంలో నా దిక్కుమాలిన మొహం నాకు కనిపించట్లేదు. ఆయనే కనిపిస్తున్నారు" అని భోరుమంటూ చెప్పింది. "నేను తట్టుకోలేక పోతున్నాను ఆచారీ" అంది.

"నాకు తెలుసు తల్లీ...నీ ఎడమ కన్ను కోసమైనా...మీరు ఆ దుఃఖాన్ని ఆపుకోవాలి. మీరిక అద్దం చూడొద్దు" అన్నాడు వైద్యాచారుడు.

"ఈ ఇంటి కుడి కన్ను ఎప్పుడో పోయింది బాబు. ఎడమ కన్ను నిలుపుకోవాలని నాకు తాపత్రయం లేదు" అన్న ఆవిడ మాట అందరితో పాటు నేనూ విన్నాను. నా కళ్ల నిండా నీళ్లు తిరిగాయి. ఇంక నాకేం కనిపించట్లేదు. మా ఫ్రెండ్‌ని 'ఇంటికెళ్లిపోదామ'ని బైల్దేరాను.

*